# నర్సాపూర్ బీఆర్ఎస్‌లో జోష్

- హరీశ్‌రావు వస్తేనే ఇంతమందైతే.. కేసీఆర్ వస్తే..
- అసంతృప్తుల చూపు బీఆర్ఎస్ వైపు



నర్సాపూర్ పట్టణంలో మంత్రి హరీశ్‌రావు సభకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు (ఫైల్)

నర్సాపూర్, నవంబర్3: ఇసుక వేస్తే రాలనంత జనం అనే నానుడు తరుచూ వింటుంటాము, కానీ ఆదివారం నర్సాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో 'ఎన్నికల ప్రచార శంఖారావం' కార్యక్రమాన్ని ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాకతో అది అక్షరాల నిరూపితమైంది. ప్రతి గ్రామం నుంచి ఓ పది మంది ముఖ్య కార్యకర్తలు సమావేశానికి రావాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి పిలుపునివ్వగా ప్రతి గ్రామం నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు తరలిరావడం జరిగింది. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఫంక్షన్ హాల్ ఆవరణం పూర్తిగా నిండిపోవడంతో కొంత మంది కార్యకర్తలు వెనుతిరిగి వెళ్లిపోవలసి వచ్చింది. సమావేశం పూర్తి అయిన తర్వాత ప్రతి గ్రామంలో ఏ నలుగురు కలిసిన అబ్బాబ్బబ్బ....ఏం జనం మాకైతే సందే దొరకలేదు... అని కొందరు, స్థలం లేక తిరిగి రావడం జరిగిందని మరికొంత మంది ముచ్చటించుకున్నారు. మంత్రి హరీశ్ సభకు కేవలం కార్యకర్తలు ఇంత మంది వస్తే రేపు ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు జనాలు తరలివస్తే పరిస్థితి ఎంటని మరికొంత మంది గుసగుసలాడుకున్నారు. ఇక ప్రతిపక్షాలు మాత్రం వచ్చిన కార్యకర్తలను చూసి దడుసుకున్నారు. ఏదైనా రాజకీయ పార్టీ బహిరంగ సభను నిర్వహిస్తే ఖాళీ కుర్చీలు, జనం లేక విలవిల, అట్టర్ ఫ్లాప్ అని ఇతర పార్టీల వాళ్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తారు. కాని ఆదివారం జరిగిన సభకు ఎలాంటి కామెంట్లు రాకపోగ ప్రతిపక్షలే విస్తూపోయాయి.

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతు తెలుపుతరా లేదా అనే సందేహానికి ఆదివారం నాటి సభతో చెక్ పడింది. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వర్గం, సునీతారెడ్డి వర్గం ఇద్దరు కలవడంతో సభలో కోలాహలం నెలకొంది. మంత్రి హరీష్‌రావు ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని మెదక్ ఎంపీగా చేసే బాధ్యత నాదేనని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే వర్గీయులు సంతోషం వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఇక మీదట నర్సాపూర్ బీఆర్ఎస్‌లో వర్గాలు ఉండవని, పాతకొత్త అనే తేడాలు చూపవద్దని అందరిది ఒకటే బీఆర్ఎస్ కుటుంబమని మంత్రి హరీశ్‌రావు కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలిగించనని ఏ వర్గం లేకుండా అందరిని కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. సునీతాలక్ష్మారెడ్డిని గెలిపిస్తే రేపు ఎంపీ ఎన్నికల్లో మనకు పూర్తి మద్దతు తెలుపుతారని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు.

బీఆర్ఎస్ బలం ఇలా ఉంటే ప్రతిపక్షాల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. టికెట్ కేటాయింపుల్లో తమ నాయకుడికి టికెట్ రాలేదని ప్రతి పక్షాలైన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. నర్సాపూర్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి ఆవుల రాజిరెడ్డికి, బీజేపీ నుంచి మురళీయాదవ్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి గాలి అనీల్‌కుమార్, ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి, బీజేపీ నుంచి గోపి, మల్లేశ్‌గౌడ్, రఘువీర్‌రెడ్డి టికెట్ ఆశించిభంగపడ్డారు. కాంగ్రెస్ అసంతృప్తి నేతలు గాంధీ భవన్ వద్ద చేసిన రచ్చ అంతాఇంతా కాదు, ఏకంగా ఓ కార్యకర్త పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం పార్టీ అధిష్ఠానంపై ఎంత గుర్రుగా ఉన్నారో తెలిసిపోతుంది. ఇక బీజేపీలో ప్రెస్‌మీట్ పెట్టి మరీ అభ్యర్థి అక్రమాలను బహిర్గతం చేశారు. బీఆర్ఎస్ గెలుపు కండ్ల ముందే కనపడుతుందని ఇక ప్రతిపక్షాలకు నూకలు చెల్లినట్లేనని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రతిపక్షాల చూపు బీఆర్ఎస్ వైపు మళ్లుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. త్వరలోనే కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో భారీ చేరికలు ఉంటాయని ఇప్పటికే చాలా మంది టచ్‌లోకి వచ్చారని బీఆర్ఎస్ శ్రేణులు వెల్లడించారు.

# తెలంగాణ వచ్చాకే ఉద్యోగం వచ్చింది



కుటుంబ సభ్యులతో చెన్నయ్య



చెన్నయ్య, ప్రభుత్వ ఉద్యోగస్తుడు

నర్సాపూర్/రామాయంపేట, నవంబర్ 3: నర్సాపూర్ పట్టణానికి చెందిన చెన్నయ్యది పేద కుటుంబం. ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న బాలయ్యభాగ్యమ్మ దంపతులకు చెన్నయ్య జన్మించారు. డిగ్రీ వరకు చదువుకున్న చెన్నయ్య ఉద్యోగం కోసం పడని తిప్పలంటూ లేవు. మొదట్లో ఓ ప్రైవేట్ కళాశాల లో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు. అనంతరం 2011 నుంచి 2017 వరకు వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో అవు ట్ సోర్సింగ్ జాబ్ చేయడం జరిగింది. చాలీచాలని జీతంతో చెన్నయ్య కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017లో మొదటి సారిగా టీఎస్‌పీఎస్సీ నోటిపికేషన్ వెలువడింది. గ్రూప్–4లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుకు చెన్నయ్య దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం చేస్తూనే పరీక్షకు సిద్ధమయ్యాడు. పాఠశాల విద్యార్థుల నుండి సేకరించిన పుస్తకాలతో పాటు కాంపిటీషన్ బుక్స్ చదివి, 2017లో మేడ్చల్ సమీపంలోని కిష్టాపూర్ దగ్గర మల్లారెడ్డి కళాశాలలో ఎగ్జామ్ సెంటర్ పడింది. పరీక్ష నిర్వహణ కట్టుదిట్టంగా జరిగింది. మొత్తానికి ఎగ్జామ్స్ విజయవంతంగా చెన్నయ్య రాశాడు. 2018లో ఫలితాలు రాగా 2019వ సంవత్సరంలో ఉద్యోగానికి ఎంపి కైనట్టు కాల్‌లెటర్ వచ్చింది. పేపర్ లీకేజీ లాంటి సమస్యలు ఎలాంటివి ఎదురుకాలేవు.

ఉద్యోగం వచ్చిందని సంతోషించే లోపే చెన్నయ్యకు చేదు వార్త తెలి సింది. ఒక సంవత్సరం పాటు శిక్షణ పొందితేనే ఉద్యోగానికి అర్హులని రూల్ వచ్చింది. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షణకు చెన్నయ్య వెళ్లాడు. శిక్షణ తరగతుల్లో కూడా చాలా నిబంధనలు పెట్టారు. పరీక్షలు, ఫీల్డ్‌వర్క్, ప్రాక్టికల్స్, థియరీ, ఎగ్జామ్స్ వాటిని నిర్వహించి అభ్యర్థులను మరింత సమర్థవంతులుగా తీర్చిదిద్దారు. ఈ శిక్షణ తరగతులు సక్రమంగా పూర్తి చేస్తేనే ఉద్యోగం ఇస్తామని అధికారులు అగ్రిమెంట్ కూడా చేయిం చుకోవడం జరిగింది. అప్పట్లో టీఎస్‌పీఎస్సీ ఎగ్జామ్స్ కట్టుది ట్టంగా నిర్వహిస్తే, నేడు పేపర్ లీకేజీ జరిగిందంటూ వార్తలు రావడం నమ్మలేక పోతున్నానని చెన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తానికి తెలంగాణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన అవకాశంతో ఉద్యోగం సాధించి కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటున్నానని వెల్లడించారు.

## మల్లా.. సీఎం కేసీఆర్‌సారే రావాలి



దంపతులు గోపీ–వరలక్ష్మి

మల్ల ఇప్పుడచ్చే ఎలచ్చన్లల్లో సీఎం కేసీఆర్ సారే గెలువాలె. ఎందుకంటే మా ఇంట్లో ఒక కొడుకుకు టీచర్ జాబ్ అచ్చింది. ఒక బిడ్డకు కళ్యాణలక్ష్మితో పెండి జేసినం. ఆ సార్‌ను ఎప్పుడు కూడా మరచిపోం. నా కొడుకుకు 2019 లో టీచర్ జాబ్ కంగ్ని మండలం బీమ్రా గ్రామంలో ఉద్యోగం వచ్చింది.అప్పటి నుండి అక్కడనే ఉండి ఉద్యోగం జేస్తుండు. ఇగ మా బిడ్డకు సీఎం సార్ దయవల్ల కళ్యాణలక్ష్మి డబ్బులు రావడంతో పెండ్లి జేసినం.గిప్పుడు మా నిరుపేదలకు ఇబ్బంది ఏమిలేదు.గిప్పుడు మాకేమి అప్పులు లేకుండా జేసిన సీఎం కేసీఆర్ సార్‌ను ఎప్పటికి కూడా యాది మరువం.మల్ల కూడా సీఎం కేసీఆర్ సార్‌కే ఓటేస్తాం.– అంబటి గోపీ–వరలక్ష్మి నందిగామ రామాయంపేట

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



అల్లాదుర్గం:రాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మోహన్

అల్లాదుర్గం, నవంబర్3: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం మోహన్ అన్నారు. అల్లాదుర్గం మండలం రాంపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2209, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు సరిపడా సంచులు, టార్పలిన్లు, తేమ నియంత్రణ యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు వచ్చి ధాన్యం అమ్మి న వెంటనే రైతు వివరాలు, బ్యాంకు అకౌంట్ నంబరు, అమ్మిన ధాన్యం తూకం వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యయ పరిశీలకుడిని కలిసిన ఎక్సైజ్ అధికారి



మెదక్ అర్బన్, నవంబర్3: మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకుడు సంజయ్‌కుమార్ ఐఆర్ఎస్‌ను జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రజాక్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు అవలంభిస్తున్న పద్ధతుల గురించి, జిల్లాలోని ఉన్నటువంటి వైన్స్ లు, బార్ల సమాచారం తెలియజేశారు. ఐఎంఎల్ డిపోలో ఉన్నటువంటి మద్యం వివరాలు సంజయ్‌కుమార్‌కు తెలిపారు.

## నేడు జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ ఇంటింటికీ ఎన్నికల ప్రచారం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 3: జిల్లా కేంద్రంలోని 11, 13, 27, 28 వార్డులలో నేడు (శనివారం) ఉదయం 8 గంటల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మెదక్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటింటికీ ఎన్నికల ప్రచారానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఉదయం 7:30 గంటల వరకు ద్వారాక గార్డెన్‌కు చేరుకోవాలని గంగాధర్ కోరారు.

## ఇంటర్‌లో ప్రవేశాలకు మరో అవకాశం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 3: 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఇంటర్ బోర్డు మరో అవకాశం కల్పించినట్లు ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇప్పటి వరకు ప్రవేశం పొందని విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

మెదక్ అర్బన్,నవంబర్3: మెదక్ విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఎస్ఈ జానకీరాములు ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్, హవేళీఘణపూర్, నర్సాపూర్, కొల్చారం మండలాలకు చెందిన వినియోగదారుల నుంచి పలు ఫిర్యాదులను స్వీకరించామని అధికారులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దశంకరంపేట, నవంబర్3: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట పట్టణ శివారులో 161వ జాతీయ రహదారిపై జరిగింది. స్థానిక ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన అల్లాపూర్ భీమరయ్య (40) పెద్దశంకరంపేట ప్రాంతంలోని రామోజీపల్లిలో వరికోసే యంత్రం హర్వెస్టర్‌లో పని చేస్తున్నాడన్నారు. పట్టణం నుంచి అన్నం తీసుకురావటానికి శుక్రవారం పెద్దశంకరంపేట నుంచి జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక భాగం నుంచి బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న భీమరయ్య అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి బంధువు విష్ణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



మోహన్ (ఫైల్)

పెద్దశంకరంపేట, నవంబర్3: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట మండలం భూర్గుపల్లిలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ బాలరాజు కథనం ప్రకారం.. భూర్గుపల్లి గ్రామానికి చెందిన నీరుడి మోహన్(32), అతని సోదరుడు నర్సింహులుతో కలిసి గ్రామ శివారులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీరుడి మోహన్ వల తట్టుకొని నీట మునిగి చనిపోయాడన్నారు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించామని తెలిపారు.